# అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం

## తెలంగాణ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నరాల

**శామ్, జూన్26(కెరటం ప్రతినిధి)**

తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఏర్పడినదే తెలంగాణ రక్షణ సమితి అని, నీళ్లు, నిధులు, నియామకాలను కల్పించేందుకు తెలంగాణ రక్షణ సమితి ఏర్పాటు చేశామని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సమితి అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని తెలంగాణ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ తెలిపారు. లక్ష్మీదేవిపల్లిలోని ధారా ఫంక్షన్ హాల్లో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరాల మాట్లాడుతూ.. గోదావరి జలాలు ఆంధ్ర ప్రాంతానికి పోతున్న దిక్కుతోచని స్థితిలో తెలంగాణ కొట్టుమిట్టాడుతుందని, నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిపోయిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ ,మిషన్ కాకతీయ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందంగా ఉందని, ప్రతిపక్ష పార్టీలలో తీవ్ర పోటీ నెలకొన్న ఈ సందర్భంలో ఓట్ల చీలికను ప్రధాన అస్త్రంగా భావిస్తామని, తాము గడపగడపకు తెలంగాణ రక్షణ సమితిని తీసుకుపోతామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమావేశాలు పూర్తయిన తర్వాత, తెలంగాణ వ్యాప్తంగా పార్టీని తీసుకుపోతామన్నారు. సుదీర్ఘకాలం పాటు సుమారు 30 సంవత్సరాలు తెలంగాణ రక్షణ సమితిని ప్రజల మధ్య ఉంచుతామని, తమ జెండా, ఎజెండా, తెలంగాణ ప్రజలేనన్నారు. తెలంగాణ ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేవని, ఇంటింటికి నల్లా లేదని, ఇంటికి ఒక ఉద్యోగం లేదని, అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి



ఇచ్చిన పోడు భూములకు పట్టాలు లేవని, దళితులకు మూడు ఎకరాల భూమి లేదని, దళిత బంధు లేదని. సబ్బండ వర్గాల ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేయడానికి, తెలంగాణ ప్రజలను రక్షించడానికి ఏర్పడినదే తెలంగాణ రక్షణ సమితి అన్నారు. కౌలు రైతులకు కౌలు భద్రతా చట్టం లేదని, కౌలు రైతులకు రైతుబంధు లేదని, నాణ్యమైన వ్యవసాయ విత్తనాలు, రసాయనిక క్రిమిసంహారక మందులు లేవన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం ఏర్పడినదే తెలంగాణ రక్షణ సమితి అని, తెలంగాణ ప్రజలను రక్షించడానికి 119 అసెంబ్లీ నియోజకవర్గాలలో, ఏడు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేస్తుందని, ఏ పార్టీ తమకు పోటీ కాదన్నారు. డిసెంబర్లో జరిగే ఎలక్షన్లలో ప్రధాన పార్టీల గెలుపు ఓటములను నిర్దేశించేది తెలంగాణ రక్షణ సమితి. ముఖ్యస్థానాలలో తెలంగాణ రక్షణ సమితి విజయకేతనం ఎగురవేస్తుంది అని తెలంగాణ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు నరాల సత్యనారాయణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సూర్యనారాయణ, సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొత్తూరి వెంకటలక్ష్మి, పినపాక నియోజకవర్గం అభ్యర్థి పూనేం సీత, మదిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్తూరు శంకర్, కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ మహమ్మద్ సలీం ఖురేషి, ఉమ్మడి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు జక్కం సాయి, మహిళా నాయకురాలు ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.



## సింథెటిక్ లాన్ టెన్నిస్ కోర్టు నిర్మాణాన్ని పరిశీలించిన డైరెక్టర్ (పా అండ్ ఫైనాన్స్)

**శామ్, జూన్26(కెరటం ప్రతినిధి)**

సింగరేణి సంస్థ ఇల్లందు క్లబ్ నందు సోమవారం సంస్థ డైరెక్టర్ (పా అండ్ ఫైనాన్స్) ఎన్.బలరాం ఐఆర్ఎస్ పర్సనల్, ఫైనాన్స్, సివిల్ డిపార్ట్మెంట్ అధికారులతో కలిసి నూతనంగా నిర్మిస్తున్న సింథెటిక్ లాన్ టెన్నిస్ కోర్టు నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (పా అండ్ ఫైనాన్స్) ఎన్.బలరాం ఐఆర్ఎస్ మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించేసింథెటిక్ లాన్ టెన్నిస్, క్రీడాకారులకు, ప్రేక్షకులకు ప్రదర్శనలు తిలకించుటకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉండే విధంగా నిర్మించాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు తగిన సూచనలు సలహాలు చేశారు. ఈ సింథెటిక్ కోర్టు వల్ల క్రీడాకారుల మోకాళ్ళకు ఎలాంటి గాయాలు కావని, బంతి అసమానంగా బౌన్స్ కాదని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అంటేనే సంక్షేమానికి మారుపేరు అని, సంస్థ సంక్షేమానికి ఎప్పుడు కట్టుబడి ఉంటుందని పునరుద్ఘాటించారు. ఈ పరిశీలనలో జిఎం పర్సనల్ వెల్ఫేర్ కె.బసవయ్య, జిఎం ఫైనాన్స్ ఎం.సుబ్బారావు, ఎస్ఓ టు జిఎం ఫైనాన్స్ సుధీర్, ఏజిఎం పర్సనల్ కవితానాయుడు, డిజిఎం పర్సనల్లు కె.శ్రీనివాస రావు, ధన్పాల్ శ్రీనివాస్, ఏజిఎం సివిల్ రామకృష్ణ, డిజిఎం ఈ అండ్ ఎం రాజీవ్ కుమార్ తదీతరులు ఉన్నారు.



# ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి వేడుకలు

## బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

**శామ్, జూన్26(కెరటం ప్రతినిధి)**

సామాజికన్యాయం అమలుకు 28 ఏళ్ల వయస్సులోనే తన రాజ్యంలో బ్రాహ్మణేతరులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి,సమాన అవకాశాలకు పునాదులు వేసిన మహనీయులు ఛత్రపతి సాహుమహరాజ్ జయంతిని పురస్కరించుకుని పార్టీ కార్యాలయం వద్ద బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహు మహరాజ్ విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తించి విద్యాసంస్కరణల కమిటీ ఏర్పాటు చేసి, 1917లోనే ఉచిత నిర్భంధ విద్య అమలు చేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా తన రాజ్యంలో కులాంతర, మతాంతర వివాహాల చట్టం తీసుకువచ్చి ప్రజాస్వామ్య విలువలకు పునాదులు వేశారని, హిందూ పిల్లల జోగిని వ్యవస్థను నిరోధించే చట్టం తెచ్చి,వివక్ష అంటరానితనం నిషేధించి కొల్హాపూర్ సంస్థానాన్ని ఎన్నో మిగతా రాజ్యాలకంటే అధునాతన,ఆధునిక భావాలతో అభివృద్ధి పథంలో



నడిపారని కొనియాడారు.అదేవిధంగా అంటరాని కులాలకు చెందిన ప్రజలకు చదువు రాకపోయినా, సైన్యంలో చేరే అవకాశాలను కల్పించి సమానత్వాన్ని చాటి చెప్పారని,అందుకే బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్షీరాం ఈ మహనీయున్ని పార్టీ సిద్ధాంతకర్తగా పేర్కొన్నారని తెలిపారు.ఛత్రపతి సాహు మహరాజ్ స్ఫూర్తితో బీసీలకు చట్ట సభల్లో 60 నుండి 70 సీట్ల వరకు ప్రాతినిధ్యం కల్పించబోయే పార్టీ కేవలం బీఎస్పీ మాత్రమే అన్నారు.బహుజన్ సమాజ్ పార్టీ పాలనలోనే ఛత్రపతి సాహు మహరాజ్ ఆశయాలను నెరవేరుస్తూ,భారతరాజ్యాంగ విలువలు కాపాడబడు తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు,జిల్లా కార్యదర్శులు చెనిగారపు నిరంజన్ కుమార్,మాలోత్ వీరు నాయక్, మాలోత్ పూర్ణ చందర్,వంగా రవిశంకర్, సందేల సందీప్ తదితరులు పాల్గొన్నారు



## 2.99లక్షల ఎకరాకు పట్టాలు ఇవ్వండి

**ఒక్క ఎకరాకు పట్టా నిరాకరించినా పోడు ఉద్యమం తప్పదు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా**

**శామ్, జూన్26(కెరటం ప్రతినిధి)**

జిల్లాలో గిరిజన, గిరిజనేతర పోడు రైతులు 2,99,748 ఎకరాలకు పోడు పట్టాలకోసం దరఖాస్తు చేసుకున్నారని, ప్రతి ఎకరాకు పోడు పట్టా జారీ చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె.సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్లో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోడు పట్టాలకోసం పేదలు అనాదిగా ఎదురుచూస్తున్నారని, వారి ఆశలకు అనుగుణంగా అధికార యంత్రాంగం, పాలకులు స్పందించాలని కోరారు.

నిబంధనల పేరుతో పేదలకు అన్యాయం చేసి వారికి బ్రతుకు దెరువులేకుండా చేయొద్దన్నారు. అనాదిగా పోడు సాగుచేసుకొని పేదలు జీవనం సాగిస్తున్నారని, ఎన్నో నిర్భందాలు ఎదుర్కొని పోడును కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. సిపిఐ చేసిన పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని గుర్తుచేశారు. పోడు పట్టాల పంపిణి ఏజెన్సీల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ఏ ఒక్క పేదవాడికి కన్నీళ్ళు పెట్టించినా చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. పోడును దక్కించేందుకు పేదలు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారని, నిర్భందాలకు గురి అయ్యారని, గత్యంతరం లేని పరిస్థితిలో కోర్టును ఆశ్రయించి భుక్తికోసమే పోడును కాపాడుకున్నారేగాని ప్రభుత్వంమీద, అధికార యంత్రాంగం మీద కోపంతో కాదనేది గుర్తించి భూములపై హక్కులు కల్పించాలని సూచించారు.

భద్రాద్రి ఎజెన్సీ ప్రశాంతంగా ఉండాలో, ఉద్యమాలతో రణభూమిగా మారాలో అధికారులే తేల్చుకోవాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బందెల నర్సయ్య, గుత్తుల సత్యనారాయణ, దుర్గరాశి వెంకటేశ్వర్లు, వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, భూక్య దస్రు, జి.వీరస్వామి, వంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.